**BELIEVERS EASTERN CHURCH WORLD HEADQUARTERS**
Office of the Metropolitan, St. Thomas Community, Kuttapuzha P. O., Thiruvalla - 689103 Kerala, India.

# కాపరి పత్రిక

ఆగస్టు/సెప్టెంబర్ 2024

బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ నందలి ఆర్చ్ బిషప్‌లకు, బిషప్‌లకు, ప్రీస్ట్‌లకు, డీకన్ ఫాదర్‌లకు, ఇవాంజెలిస్ట్‌లకు, సిస్టర్స్ ఆఫ్ ఆర్డర్‌కు మరియు విశ్వాసులైనవారందరికి తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామములో శుభములు మరియు వందనములు. ఆమేన్! ✠

క్రీస్తునందు నా ప్రియమైన వారలారా,

ఇది బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ యొక్క మెట్రోపాలిటన్ తండ్రిగా అభిషేకించబడిన అనంతరము పంపబడుచున్న నా తొలి కాపరి పత్రిక. నాపై గల మీ ప్రేమకు మరియు నా గురించిన మీ ప్రార్థనలకు నేనెంతో ధన్యుడనుగా భావిస్తూ ఈ మాటలు ప్రారంభిస్తున్నాను. మన యెడల నమ్మకత్వము కల్గి, ప్రత్యేకముగా గత కొంత కాలముగా ఆయన ప్రేమచే మనలను నడిపించిన మన పరలోకపు తండ్రికి నేను కృతజ్ఞుడనైయున్నాను.

ఈ పత్రిక ద్వారా, కొన్ని ప్రాముఖ్యమైన విషయములను మీ గమనమునకు తీసుకురావాలని నేను ఆశపడుచున్నాను.

**మొదటగా:** అక్టోబర్ 2024 లో జరుగబోవు **యూత్ అసెంబ్లి** ని గూర్చి.
యువత మన చర్చి యొక్క భవిష్యత్తు అయియున్నారు. వారు తమ స్థానిక పారిష్‌లు మరియు కమ్యూనిటీలలో ఆధ్యాత్మికంగా బలపరచబడుచూ, ఉత్సాహంగాను మరియు చురుకుగా ఉండుట ద్వారా మన చర్చి యొక్క భవిష్యత్తు సురక్షితమైన స్థితిలో ఉండగల్గుతుంది. ఆ ఉద్దేశ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, మనము 2024 అక్టోబర్‌లో వివిధ డయాసిస్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిక చేయబడిన యువకుల సమూహం ఏకముగా చేరివచ్చుట ద్వారా నిర్వహించబడనైయున్న యూత్ అసెంబ్లీ కొరకు ప్రార్థిస్తూ, సిద్ధపాట్లు జరిగిస్తూ, ప్రణాళికలను రూపొందిస్తున్నాము. దయచేసి ఈ యూత్ అసెంబ్లీ కొరకై మనఃపూర్వకముగా ప్రార్థనలు జరిగించగలరని కోరుచున్నాము.
మీ కుటుంబ ప్రార్థనలలో ఈ సంధర్భము కొరకై తప్పక ప్రార్థించగలరు; యూత్ కాన్ఫరెన్స్ ముగిసే వరకు మీ పారిష్‌లో ప్రార్థన సమావేశాలను రూపొందించాల్సిందిగా తెలియజేయుచున్నాము. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేవారి సురక్షితమైన ప్రయాణము కొరకు మరియు ఇంకనూ జరిగించవలసిన ఏర్పాటుల గురించి మరియు ఈ కూటములలో మన యువకులలో ఒక పవిత్రమైన జీవితానికి మేల్కొలుపు కల్గునట్లుగా ప్రార్థించగలరు.

**రెండవదిగా:** పవిత్ర చర్చితో కలసి సేవ చేయడానికి శిక్షణ పొందేందుకు తమ జీవితాలను అంకితం చేయడానికి మన పారిష్‌ల నుండి నిబద్ధతతో కూడిన యువ సహోదరులు మరియు సహోదరీలు ఎంతగానో అవసరమైయున్నారు. యేసు చెప్పినట్లుగా, ప్రజల ఆధ్యాత్మిక అవసరాలు ఎంతో ప్రాముఖ్యమైనవి, అయితే ఆ అవసరాలను తీర్చడానికి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. మరి, దాని కొరకై మనం ఏమి చేయగలము? ఆ పాత్రను నెరవేర్చగల అనేక మందిని పంపమని ప్రభువును ప్రార్థించాలి. (పరి. మత్తయి 9:36-38) ఇది మన ప్రార్థనా సమావేశాలన్నింటిలో – చర్చిలో మరియు మన కుటుంబాలలో – ఏడాది పొడవునా స్థిరంగా ప్రార్థించే ప్రార్థన మనవిగా ఉండవలయును. మీరు తల్లిదండ్రులైతే, మీ పిల్లలు తమ జీవితాలను దేవుని సేవకు అంకితం చేసుకొనుట కొరకు ప్రార్థించగలరు. దానికై మొదటగా మనం ఉదాహరణగా ఉందాం, తదుపరి ఇతరులు దానిని అనుసరించువారుగా ఉంటారు.

**మూడవదిగా:** మన మేజర్ సెమినరీ, డయాసిస్ సెమినరీలు మరియు సిస్టర్స్ ఆఫ్ ది క్రాస్ శిక్షణా కేంద్రాలలో నూతన అకడమిక్ సెషన్‌లు ప్రారంభమయ్యాయి. శిక్షణ పొందుతున్న ప్రియమైన సహోదర – సహోదరీల కొరకు ప్రార్థించగలరు, వారు అక్కడ చదువుకొనుటకు, శిక్షణను పొందుకొనుటకు మరియు తమ్మును తాము సిద్ధమనస్సును పెంపొందించుట కొరకు ప్రార్థించగలరు.

నాల్గవదిగా: పవిత్ర చర్చి యొక్క ఆర్థిక అవసరాల కొరకు ఇవ్వడంలో మనం నమ్మకంగా కొనసాగించబడదాం. ఈ క్రమములో పరిశుద్ధ పౌలు గారు మాసిడోనియాలోని సంఘమును మనకు గుర్తుచేస్తున్నాడు, వారు కడు పేదరికం మధ్యలో కూడా వారి సామర్థ్యానికి మించి ఇవ్వగలిగారు (2 కొరింథి 8:1-5). " తమంతట తామే యిచ్చిరి" అలాగుననే ఆ పేద విధవరాలు వలె ఉదారంగా, ఇష్టపూర్వకంగా మరియు నమ్మకంగా ఇవ్వడములో మన పవిత్ర చర్చి కూడా ప్రసిద్ధి చెందవలెను (పరి. మార్కు 2:41-44). దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును (2 కొరింథి 9:6, 7) అనే విషయమును గుర్తుంచుకోండి, మరియు మన ప్రభువునకు ఇచ్చినప్పుడు, ఆయన ఆకాశపువాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని ఆయన వాగ్దానం చేసియున్నాడు (మలాకీ 3:10, 11 )

ప్రియమైన పిల్లలారా, నేను ముగించుటకు ముందు, మన దేశం, రాష్ట్రం మరియు ప్రాంత నాయకుల కొరకు ప్రార్థన చేయడం చర్చిగా మన బాధ్యతయైయున్నది అని నేను మీకు గుర్తు చేస్తున్నాను (1 తిమోథి 2:1-4). దానిని మనం నమ్మకంగా జరిగిద్దాం. హింస మరియు అస్థిరతతో అతలాకుతలమైన బంగ్లాదేశ్ దేశం కొరకు కూడా మనం ప్రార్థిద్దాం – దేశంలో శాంతి మరియు సుస్థిరత త్వరితముగా తిరిగి రావాలని. దయచేసి ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన ప్రాంతాల కొరకు కూడా ప్రార్థించండి, సృష్టికర్తయైన దేవుడు తన ప్రజలపై దయ మరియు కరుణ కలిగి ఉండుట కొరకు ప్రార్థించగలరు.

చివరగా, ప్రియమైన సహోదరి సహోదరులారా, చిరస్మరణీయులు మన దివంగత అథనాసియస్ యోహాన్ I మెట్రోపాలిటన్ గారు, అపొస్తలుల కార్యముల గ్రంథము మన చర్చి యొక్క నమూనయై యుండవలెనని తరుచుగా చెప్పేవారు; అది మనకు మార్గనిర్దేశకము, మన ఆర్థడాక్స్ విశ్వాసానికి ప్రాథమిక మార్గదర్శకమైయున్నది. కావున ఈ గ్రంథమును తరచుగా చదవండి; అందులోని సూత్రాలను మనం వ్యక్తిగత జీవితములోను, సమూహములోను మరియు మన పారిష్‌లలోను వాటిని వర్తింపజేద్దాం, తద్వారా మనమందరమూ చర్చిని వృద్ధి చెందుదాం.

మనము ముందుకు ప్రయాణిస్తున్నప్పుడు, పవిత్ర చర్చి యొక్క ప్రభువును రక్షకుడునైయున్న క్రీస్తు యేసుపై మన కన్నులను నిలిపియుంచుదాము, ఆయనను సంతోషపెట్టే జీవితాన్ని గడపడానికి ప్రతిరోజూ శక్తిని మరియు ప్రేరణను పొందుదాం. ప్రేమ మరియు సేవ చేయాలనే మన లక్ష్యములో పరిశుద్ధాత్మ మనకు ఎల్లప్పడూ మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాడు, మరియు మన ప్రయత్నాలన్నీ ఫలించి, శాశ్వత ఫలాలను అనుగ్రహించునుగాకా, అట్టివి ఇప్పడునూ ఎల్లప్పడునూ సధాకాలము పరిశుద్ధ త్రిత్వమైయున్న తండ్రి కుమార పరిశుద్ధాత్మకే సమస్త మహిమ, ఘనత, ఆరాధన, ప్రభావము మరియు భయభక్తులను తీసుకువచ్చునుగాకా ✠.

క్రీస్తునందు, మీ ఆత్మీయ తండ్రి,

మోరన్ మోర్ సామ్యేల్ థియోఫిలస్
మెట్రోపాలిటన్

**తేదీ:** 12 ఆగస్టు 2024
**స్థలం:** వరల్డ్ చర్చ్ హెడ్‌క్వార్టర్స్

ముఖ్య గమనిక: దయచేసి ఈ పత్రికను విశ్వాసుల ప్రోత్సాహం కొరకై ప్రతి పారిష్‌లలో చదివి వినిపించగలరు.